# సింగిల్ పేజీ కథలు

## కస్టమర్

చక్రవర్తి నగల దుకాణంలోనికి అడుగుపెట్టేసరికి 'మీ సేవయే మా ధ్యేయం' అన్న బోర్డు కన్పించింది. అది నగరంలోకెల్లా అతి పెద్ద దుకాణం. అందులో అడుగుపెట్టిన వారందరికీ వి.ఐ.పి ట్రీట్‌మెంట్. అందుకే అతడి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వెలుగుతోంది.

''ఏం కావాలి సార్?'' అని తియ్యని గొంతుతో సేల్స్‌గర్ల్ అడిగింది.

భూలోక దేవతలా ఉన్న ఆ అమ్మాయిని చూసి చక్రవర్తికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఇంతలో మరో అమ్మాయి వచ్చి ''కూర్చోండి సార్'' అంది.

అతడు మొహమాటపడుతూనే ''పర్లేదండి'' అంటూ కూర్చొని ''బంగారు గాజులు చూపించండి'' అన్నాడు.

అతడి మొహమాటం చూసి సేల్స్‌గర్ల్ చిన్నగా నవ్వుకుంది. ఆమె సర్వీసులో ఇలాంటివారిని చాలామందిని చూసింది. వీరిచేత ఏదో ఒక వస్తువు కొనిపించటం చాలా తేలిక అనుకుంటూ నాలుగయిదు బాక్సులు తెచ్చి అతని ముందుంచింది.

వాటిలో ప్లెయిన్‌గాజులు నుండి వజ్రాలు పొదిగిన వాటివరకు రకరకాల డిజైన్లలో ఉన్నాయి. అతడికి కళ్ళు జిగేల్మన్నాయి.

''సార్.. కాఫీ, టీ, కూల్‌డ్రింకు.. ఏం తీసుకుంటారు?'' అని అడిగింది సేల్స్‌గర్ల్.

మొహమాటపడుతూనే ''ఏం వద్దు'' అన్నాడు చక్రవర్తి.

''పర్లేదు సార్, మీరు ఏదో ఒకటి తీసుకోవాలి''




చక్రవర్తి జవాబు చెప్పకుండా, ఏ రకం గాజులు తన భార్యకి సరిపోతాయా? అని ఆలోచిస్తున్నాడు.

సేల్స్‌గర్ల్ చనువుగా ''సార్‌కి పెప్సీ తీసుకురా అప్పారావు'' అని బాయ్‌కి ఆర్డరిచ్చింది.

''అయ్యో వద్దండీ'' అంటూనే గాజులు చూడటంలో నిగమ్నమయిపోయాడు.

సేల్స్‌గర్ల్ అతని చేతిలో ఉన్న గాజుల వైపు చూసి ''ఇవి లేటెస్ట్ మోడల్ సార్'' అంది.

ఇంతలో బాయ్ పెప్సీ తెచ్చి చక్రవర్తి ముందు పెట్టాడు. కాస్త ఇబ్బంది పడుతూనే పెప్సీ తాగుతూ ''ప్రస్తుతం బంగారం రేటు ఎలా ఉంది?'' అన్నాడు.

''నాలుగు నుండి అయిదువేల వరకు ఉంది సార్'' అంటూ అతని చేతిలో ఉన్న గాజులను చూపించి ''వీటిని ప్యాక్ చేయమంటారా?'' అని అడిగింది.

''సరే'' అని చెప్పి చక్రవర్తి కేష్ కౌంటరు దగ్గరకు వెళ్ళాడు.

బిల్లు తీసుకుని పది రూపాయలు తక్కువ ఇచ్చాడు.

కేషియర్ డబ్బు లెక్కకట్టి ''సార్..పది రూపాయలు తక్కువ'' అన్నాడు.

''అవును. నేను వద్దన్నా డ్రింకు ఇప్పించారు. కానీ ఆ డబ్బులు ఏదో ఒక రూపంలో కస్టమర్ మీదే వేస్తారు. నాకిష్టం లేకుండా మీ బలవంతం మీద తాగిన డ్రింకుకి నేనెందుకు డబ్బులివ్వాలి?''

కేషియర్‌కి, అతడి సర్వీసులో ఎవ్వరూ ఇలాంటి షాక్ ఇవ్వకపోవటంతో గుడ్లప్పగించి చక్రవర్తిని చూస్తూనే ఉన్నాడు.

చక్రవర్తి నిదానంగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

**-మరడ వెంకట దాశరథిరావు**
(సూరత్)

## చెప్పేందుకే నీతులు

ఫ్రెండ్ సులోచన బ్యాంక్ ఆఫీసర్‌గా హైదరాబాద్ వచ్చినట్టు తెలుసుకున్న సునీత, ఓ శెలవురోజున వాళ్ళింటికి వెళ్ళింది. ఇద్దరూ ముచ్చటగా కాలేజీ కబుర్లూ, సంసారంలో సాధకబాధకాలూ, ఉద్యోగాల్లో సమస్యలూ చర్చించుకున్నారు.

అలా మాట్లాడుతూనే, పనమ్మాయి మల్లికను గమనిస్తూంది సునీత. పట్టుమని పదేళ్ళయినా లేని ఆ పిల్లలో చురుతనం, చేసే పనిపట్ల శ్రద్ధ, పరిశుభ్రతా ఇట్టే గ్రహించేసింది.

పని పూర్తిచేసుకుని మల్లి వెళ్ళిపోయాక,



యధాలాపంగా మల్లి వివరాలు అడిగి తెలుసుకుని, ''సులోచనా.. మల్లి మీ ఇంట్లో ఇలా పనిచేస్తున్నట్టు ఎవరికైనా తెలిస్తే ప్రమాదం సుమా..'' అన్నది.

''ఏమిటి ప్రమాదం?'' అర్థంకాక అడిగింది సులోచన.

''ఇలా చిన్నపిల్లల చేత చాకిరీ చేయించడం బాలకార్మిక చట్టరీత్యా పెద్దనేరం! ఇలా పనిచేయించే యజమానులకు పనిష్మెంట్ వుంటుంది. ఈమధ్య సి.ఎం.గారు, ఈ విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా వుంటున్నారు. బాల బాలికలచేత పన్లు మాన్పించి, విద్యాబుద్ధులు చెప్పించి, తమ కాళ్ళమీద తాము నిలబడే వెసులుబాటు కలిగించాలనేది ఆయన తపన. అందుకే ఎవరూ పిల్లలు పనిచేయుడం లేదు...పత్రికలు చదవడం లేదా సులోచనా?''